# కృపచేతనే రక్షణ

"మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను. (కృపచేత మీరు రక్షింపబడియున్నారు)" అని ఎఫెసీ. 2:5లో మనం చదువుతాం. లేఖనాల్లో కృపకు గొప్ప ప్రాధాన్యత యివ్వబడింది. పౌలు రచనలలో మాత్రమే "కృప" అనే పదం ఎనభై రెండు పర్యాయాలు ఉపయోగింపబడింది. వాస్తవంగా, కృప అనే పదాన్ని క్రొత్త నిబంధన ఎంత ముఖ్యమైనదిగా ఆలోచిస్తుందంటే, కృపచేతనే మనం రక్షింపబడ్డామని అది చెప్తుంది. మన లేఖన భాగం దాన్ని ప్రకటించింది: "నమ్మువారు ఆయన కృప చేతనే ... ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" అని పౌలు రోమా 3:24లో అన్నాడు.

## కృపకు అర్థమేమి?

"కృప"కు కరుణతో చేసే "ఉపకారం" అని అర్థం. మనయందు ఏ యోగ్యత లేకుండగనే దేవుని ఉపకారం ద్వారా మనం రక్షింపబడ్డాం. నరుడు తన దుష్టత్వంచేతనే తన్ను తాను దూరం చేసికొన్నాడు (యెషయా 59:1, 2; రోమా 3:23). దేవునితో సమాధానపడడానికి తానుగా చేయగలిగిందేమీ లేదు. అయినా కరుణాసంపన్నుడైన దేవుడు మానవ క్షమాపణార్థం ఒక మార్గాన్ని ప్రసాదించే మేరకు నరుని ప్రేమించాడు. ఆ మార్గాన్ని ఏర్పరచడానికి దేవుడు విస్తృతంగా చేసిందంతా "కృప" అనే మాటలో చేర్చబడింది. నిజంగా ఏమి చేర్చబడింది?

(1) **క్రీస్తు, దేవుని ప్రేమాదానంగా చేర్చబడ్డాడు.** నీతిమంతులనుగా తీర్చడం అనే గొప్ప సంకల్పము దేవుని మనస్సులో పుట్టింది. అప్పుడు అది తన కుమారునియందు రూపు దిద్దబడింది. ఆయన క్రైస్తవ విధానానికి కేంద్రస్థానం, మన విశ్వాసానికి గురి, మన నిరీక్షణకు లంగరునైయున్నాడు. దేవుడు లోకమును ఎంతో ప్రేమించి మన పాపములకు శాంతికరమైయుండునట్లు యేసును అనుగ్రహించాడు (యోహాను 3:16; 1 యోహాను 2:2). లోకానికి యేసును అనుగ్రహించడంలో కృపయే దేవుని ప్రోత్సహించింది.

(2) **క్రీస్తు రక్తము అందులో చేర్చబడింది.** చిందింపబడిన ఆయన రక్తములోనే విమోచన అనే విషయం హెబ్రీ. 9:22; 1 యోహాను 1:7; ఎఫెసీ. 1:7లు చెప్తున్నాయి.

ఇది పూర్ణంగా దేవుని సంజ్ఞయై ఉంది. ఈ బలికి మానవ యోగ్యత ఏమీలేదు; ఇది కేవలం కృపయే. ఆయన మన స్థానాన్ని తీసికొని, మన కొరకు మృతినొందాడు.

(3) **పరిశుద్ధాత్మయు, మార్పు చేయడంలో ఆయన పనియు "కృప" అనే మాటలో చేర్చబడడం జరిగింది**. మనము ఆత్మవలన నీతిమంతులముగా తీర్చబడ్డాం (1 కొరింథీ. 6:11). అపొస్తలులును, మిగిలిన దైవ ప్రేరేపితులైన మనుష్యులద్వారా ఆత్మ, లోకానికి సువార్తను అందించాడు. సువార్త ద్వారా, పరిశుద్ధాత్ముడు విధేయులైన పాపులను మార్పు చేస్తూ ఉంటాడు (ఎఫెసీ. 6:17).

(4) **సువార్త రక్షిస్తుంది** (రోమా 1:16). పాపులను రక్షించడంలో దేవుని భాగంగా సువార్త సందేశం తప్పక చేర్చబడింది. మానవుని యెడల ఉన్న దేవుని కృపలో లేక ఉపకారంలో ఇది తప్పక చేర్చబడింది.

ఈ మూల సూత్రాల్లోని ప్రతి దానిలోను, కృపా విధానము చేర్చబడింది. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ, సువార్త, వీరిలో ప్రతి ఒక్కరు పాపిని రక్షించడంలో చేసిన పని "కృప" అనే భావనలో కూడి ఉన్నాయి.

## రక్షణ కేవలం కృపవలన మాత్రమేనా?

"రక్షణ కేవలం కృపవలన మాత్రమేనా?" అని మనం అడిగినప్పుడు, "పరలోకం యొక్క ప్రయాసల మీదనే రక్షణ ఆధారపడి ఉందా?" అని మన భావం. కొందరు యిలాగే చెప్పుతున్నారు. ఇదే వాస్తవమైతే, ఈ రెండింటిలో ఏదో ఒక తీర్మానానికి మనం వచ్చి చేరుకోవాలి: దేవుడు ప్రజలందరిని రక్షించనైనా రక్షించాలి, లేదా ఆయన కొంతమందినే ఎన్నుకొని ఏలాటి షరత్తులు లేకుండగనే వారిని రక్షించాలి. "కృప మాత్రమే" అనే భావన, సార్వత్రిక రక్షణనైనా అంగీకరింపజేస్తుంది లేదా అది ఏ షరత్తులూ లేని ముందు తీర్మానమైనా అయ్యుండాలి. ఈ రెండింటిలో ప్రతి ఒక్కటి మతస్థులు బోధిస్తున్నా, ఆ రెండును కాదనలేని తప్పులైయున్నాయి. కొందరు నశించిపోతారని బైబిలు స్పష్టంగా బోధిస్తుంది (మత్తయి 7:13). నిష్కారణంగా (షరత్తులు లేకుండానే) కొందరిని ఎన్నుకొనడం, తక్కినవారిని నిరంకుశత్వంగా శిక్షించడం అంటే, దేవుడు పక్షపాతియని నిందించడమే అవుతుంది; లేఖనాలు దీనికి సమ్మతించవు (రోమా 2:11). "కృప మాత్రమే" అనే సిద్ధాంతం నిజం కానేరదు.

## కృపచేత ఎవరు రక్షించబడతారు?

దేవుని కృపను లేక ఆయన ఉపకారాన్ని అంగీకరించినవారు మాత్రమే కృపచేత రక్షింపబడతారు. ఏ దానమైనా అంగీకరించబడాలి. మనం చేయవలసింది ఏదైనా ఉన్నట్టయితే, రక్షణ కృపవలన ఎలాగౌతుందో కొందరు గ్రహించలేకున్నారు. అయినా, అది సత్యమే; దాన్ని మనం చూడబోతాం.

ప్రకృతిలోనుండి ఒక చిన్న ఉదాహరణ తీసుకోవచ్చు. దేవుని కృపవలన మనకు ఆహారం లభిస్తుంది. మనం అనుదిన ఆహారం కొరకు ప్రార్థించి, దేవుడు మనకు దయ

చేస్తాడని నమ్ముతాం, అయినా, మనం మన వంతు పని చేస్తాం. ధాన్యాన్ని పండించి, భోజనం తయారు చేసికొన్నా, అది దేవునినుండి అనుగ్రహింపబడిన దానమే. ప్రకృతి పరిధిలో దేవుని నియమాలతో సమ్మతించుటచేత ఈ దానాన్ని మనం పొందుతున్నాం.

నోవహు దేవుని దృష్టియందు "కృప పొందినవాడై"యున్నట్టు ఆది. 6:8 తెలుపు తోంది. అయినా అతని రక్షణ కొరకు దేవుడు ఒక సంకల్పాన్ని ఏర్పరచి, దానిని ఆయన అతనికి తెలిపాడు: అది కేవలం ఆయన ఉపకారము లేక కృపయే. అయినా అతడు చేయవలసిన భాగముంది; అతడు ఓడ కట్టడం అవసరం. హెబ్రీ రచయిత ప్రకటించినట్టు అతడు విశ్వాసము, విధేయతలచేత రక్షింపబడ్డాడు (11:7).

యెహోషువ 6:2 ప్రకారం, యెరికో పట్టణాన్ని దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయులకు యిచ్చాడు. అది కృపవలన యివ్వబడిన దానమే. అయినా, ఆ పట్టణాన్ని వారు ఎలా పట్టుకోవాలో సూచింపబడ్డారు. దేవుడు వారికి దయచేసిన పట్టణాన్ని కైవశం చేసికొనడానికి, వారిపట్ల ఒక వారం దినాల పని అవసరమైయుంది. కృప విధేయతతో కూడిన కార్యాన్ని రద్దుపరచదు.

మన లేఖన భాగంవైపు ఒకసారి చూడు. ఎఫెసీయులు కృపవలన రక్షింపబడ్డారని పౌలు అన్నాడు. అపొ. 19లో వారి మార్పు యొక్క వివరాలను మనం పఠించవచ్చు. వారి మార్పులో పౌలుచే సువార్త ప్రకటింపబడడం అనే మానవ సాధనం యిమిడియుంది. దానికి విశ్వాసం అవసరమైయుంది, మరియు బాప్తిస్మం అవసరమైయుంది. ఆ సంఘటనవైపు పౌలు చూస్తూ, వారు కృపవలన రక్షింపబడ్డారు అని చెప్పాడు. మనం వారి సంఘటన చదువవచ్చు, కృపచేత వారు ఎలా రక్షింపబడ్డారో నేర్చుకోవచ్చు.

ఇప్పుడు, ఈ సంఘటనలన్నింటిలో కృపచే ఆశీర్వాదం ఎలా లభ్యమయ్యిందో, అయినా మానవ కార్యం ఎలా అవసరమయ్యిందో, మనం చూడగలిగినట్లయితే, మన పక్షంగా జరుగవలసిన కొన్ని విధేయతా కార్యాలను నిరాకరించకుండడంవల్లనే, మన రక్షణ కృపచేత వస్తుందని మనం ఎందుకు అంగీకరించకూడదు? రక్షింపబడడానికి మనం చేయవలసిందిగా దేవుడు ఆజ్ఞాపించినవన్నియు చేసిన తరువాత కూడా, అది యింకను కృపాకార్యమే అయ్యుంటుంది. అల్పమైన ఆ విధేయతా కార్యములతో రక్షణను మనం సంపాదించుకున్నామని వాదించలేం!

రక్షణ కృపవలననైనది; దాన్ని సంపాదించుకొనడానికి గాను ప్రశంసా యోగ్యమైన కార్యాలను చేసినందువల్ల సాధించం. ఆయన ఆజ్ఞాపించినది యావత్తు జరిగించిన తరువాత, మనమింకను నిష్ప్రయోజనమైన దాసులమే (లూకా 17:10). విధేయతతో కూడిన విశ్వాసంవలన దేవుని ఉపకారం మనకు లభ్యమౌతుందని గ్రహించినా, "ఆశ్చర్యమైన కృప! ఆ స్వరము ఎంత మనోహరము!" అని విశ్వాసము, విధేయతతో పాడవలసిందే.